నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

మంగళవారం | ఏప్రిల్ 16, 2024 | www.navatelangana.com

రోడ్డు ఎలా దాటాలి?



ప్రమాదకరంగా దాటుతున్న పాదాచారులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని పద్మాజివాడి చౌరస్తాలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతుండగా.. రోడ్డు దాటేందుకు పాదాచారులకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం వరకు ఒక దిక్కు నుండి పాదచారులు వెళ్లేందుకు దారి ఉండేది. సోమవారం నుండి ఆ దిక్కు కూడా రోడ్డు పనులు జరగడంతో పాదచారులకు నాన ఇబ్బందులు ఏర్పడింది. బ్రిడ్జి కింది నుండి ఇనుప సపోర్ట్‌లు ఏర్పాటు చేసినవి ఒక దిక్కు బ్రిడ్జి పూర్తిగా మరో దిక్కు బిడ్జీ పనులు నడుస్తున్నాయి. ఆ పనులు పూర్తి కాక ముందే ఇరు పక్కల పాదాచారులకు దారి బందు చేయడంతో ఇనుప పరంచల నుండి ప్రయాణికులు ప్రమాదకరంగా దాటాల్సి వస్తుంది. పలువురు ప్రయాణికులు నవతెలంగాణ తెలంగాణతో మాట్లాడుతూ బ్రిడ్జి పనులు పూర్తి అయినంక ప్రారంబిస్తే బాగుండెదని సూచిస్తున్నారు.

బడాపహాడ్‌లో ముగిసిన టెండర్

- వక్ఫ్‌బోర్డు సాధీనంలోకి పెద్దగుట్ట



నవతెలంగాణ-వర్ని

నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామ శివారులో గల బడాపహాడ్ బాబా షాదుల్లా హుస్సేన్ దర్గా నిర్వహణ టెండర్ ఆదివారం రాత్రితో ముగిసింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ప్రస్తుతం టెండర్‌లు వేయకుండా.. వక్ఫ్‌బోర్డు అధికారుల ఆధ్వర్యంలో ఇక మీదట పెద్దగుట్ట నిర్వహణ చూడనున్నారు. ఈ మేరకు వక్ఫ్ బోర్డు సీఈఓ ఖాజా మొయినావుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి వక్ఫ్ బోర్డు సిబ్బంది ఆధ్వర్యంలోనే బడాపహాడ్ దర్గా పూజలు, పలు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష
- అధికారులకు దిశా నిర్దేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం నిజామాబాద్ లోక్ సభ సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18న విడుదల కానుండగా, ఆ రోజు నుండే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పక్కాగా పరిశీలించుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా చేపట్టిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన, ఎన్నికల నిర్వహణ కోసం నియమించబడిన సిబ్బందికి శిక్షణ తరగతులు, తనిఖీ బృందాలు, చెక్ పోస్టులు, భద్రతాపరమైన చర్యలు, ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం నిల్వలు, ఇతర విలువైన వస్తువులు తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఎక్కడ కూడా, ఏ దశలోనూ తప్పిదాలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ఈ.సీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, స్వీప్ అధికారి సురేష్ కుమార్, ఆర్డీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న కలెక్టర్

అవినీతిపాలనకు చరమగీతం

- నీతవంతమైన పాలన అందిస్తాం
- మున్సిపల్ చైర్మన్ సీటు కైవసం కావడంపై షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

నాలుగేళ్ళ 3 నెలల అవినీతి పాలనకు చరమగీతం పాడామని, ఇకపై నీతి నిజాయితీవంతమైన పాలనందిస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెడతామని వెల్లడించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో కామారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్లతో కలిసి సమావేశమై కామారెడ్డి లో గల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడానికి ఆయన సహకారాన్ని కోరనున్నట్టు తెలిపారు. రాబోయే 8 నెలల్లో బెస్ట్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్‌లు సోమవారం మర్యాద పూర్వకంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి పూలదండ వేసి శాలువా కప్పి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 50 మంది ఓటింగ్ కు 29 ఓట్లు వచ్చాయనీ, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో చైర్మన్ గా గడ్డం ఇందుప్రియ మున్సిపల్ చైర్పర్సనుగా ఎన్నికయ్యారు అన్నారు. వైస్ చైర్మన్‌గా త్వరలోనే ఉరుదొండ వనిత ఎంపిక అవుతారనీ తెలిపారు. మున్సిపాలిటీలో ప్రజలకు సరిపడా నీళ్లు రావడం లేదనీ ఎన్నికల తర్వాత సీఎం సమక్షంలో మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం అని, ఇందిరాగాంధీ స్టేడియంలో 24 గంటల లైటింగ్ సౌకర్యం కల్పించి జాతీయ స్థాయి స్టేడియంకు కావాల్సిన వసతులు కల్పించనున్నట్టు వెల్లడించారు.



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

పట్టణంలో తాను చదువుకున్న ప్రభుత్వ బాలుర పాఠశాల కూలిపోయే స్థితిలో ఉందనీ తన సొంత నిధులు 2-3 కోట్లు, ప్రభుత్వం నుండి మరిన్ని నిధులు తీసుకువచ్చి అధునాతన వసతులతో నూతన పాఠశాల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. 'కామారెడ్డిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేసి నూతన రైల్వే బ్రిడ్జిను ఏర్పాటుకు శ్రీకారనికి రైల్వే అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తామని తెలిపారు.

అప్పుల కుప్ప చేశారు

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 10 వేల కోట్ల మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుతో కెసిఆర్ సీఎం రేవంత్ చేతిలో పెట్టారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటికే 5 గ్యారెంటీల అమలు పూర్తి చేశాం. 90 రోజుల్లో 31 వేల ఉద్యోగాలిచ్చి చరిత్రలో నిలిచాం. ఎన్నికల కోడ్ తర్వాత మరొక 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసి ఏడాదిలో లక్ష ఉద్యోగాలు ఇవ్వడమే కాంగ్రెస్ పార్టీ టార్గెట్ అని అన్నారు.

బీబీ పాటిల్‌కు కనీసం మండలాల పేర్లు తెలుసా..?

'బీఆర్ఎస్ నాయకులు సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారు. ఆకాశంపై ఉమ్మితే మనపైనే పడుతుందని వారు మర్చిపోతున్నారు. 10 సంవత్సరాల్లో బిబిపాటిల్ కేంద్రం నుంచి గాని, రాష్ట్రం నుంచి గాని నయ పైసా పని చేయలేదు. పార్లమెంట్ పరిధిలో ఒక్క మండలం పేరు కూడా ఆయనకు తెలుసా అని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఇక్కడి సమస్యలపై ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కనీసం రైల్వే బ్రిడ్జి కూడా మంజూరు చేయించలేకపోయిన ఎంపి బీబీపాటిల్. ఇప్పటిదాకా రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్ కుటుంబ పాలన జరిగిందనీ, ప్రస్తుతం ప్రజా పాలన నడుస్తోంది. ఎన్నికలకు సంవత్సరం ముందే పిసిసి హెూదాలో ఉన్న రేవంత్ రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ పై చెప్పిన మాటలు నేడు నిజమని తేలాయి. కేంద్రం అనుమతి లేకుండా ట్యాపింగ్ చేసి నాయకులు, భార్యాభర్తల మాటలు విన్నారు. నాకున్న సమాచారం ప్రకారం త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకు పోయే అవకాశం ఉందని, మోడీ ఝూటా మాటలు, ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రాష్ట్రానికి మేలు మేలుకు జరుగుతుంది. దేశంలో ఇండియా కూటమిని గెలిపించుకుంటాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, అన్వర్, ఉరుదొండ వనిత, అనుష, అధ్యక్షుడు పండ్ల రజు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, దేవి పేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్, జనగామ తాజ మాజీ సర్పంచ్ పాత రాజు పాల్గొన్నారు.



క్యాంప్ నుంచి ప్రత్యేక బస్సులో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కౌన్సిలర్‌లు

చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ

కాంగ్రెస్ వశమైన కామారెడ్డి మున్సిపల్



ఇందుప్రియకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీవో

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందు ప్రియ ఎన్నికైయ్యారు. దీంతో మున్సిపల్ కాంగ్రెస్ వశమైంది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌డిఓ రఘునాథ్‌రావు అధ్యక్షతన నూతన చైర్ పర్సన్ ఎన్నికకు మునిసిపల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో 49 మునిసిపల్ వార్డులు, ఒక ఎక్స్-అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యేతో కలిపి మొత్తం 50 మంది సభ్యులకు గాను కోరమ్ 26 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా.. 28 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుండి సీల్డ్ కవర్‌లో 14వ వార్డుకు చెందిన గడ్డం ఇందు ప్రియ పేరు రాగా 48వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అన్వర్ అహ్మద్, 38వ వార్డు కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్లు చైర్ పర్సన్ గా ఆమె పేరును ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా 28 మంది కౌన్సిలర్లలో ఎవరైనా తటస్థంగా ఉన్నారా అని మరోమారు చేతులెత్తవలసినదిగా కోరగా అందరు ఇందు ప్రియ పేరును ఆమోదిస్తూ చేతులెత్తారు. అనంతరం కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానిస్తూ సంతకాలు చేశారు. ఇందు ప్రియ మునిసిపల్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్.డి.ఓ. ప్రకటిస్తూ డిక్లరేషన్ ఇచ్చిన అనంతరం ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ సుజాత పాల్గొన్నారు.



భిక్కనూర్ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయాలు

ముందుకు కదలని జీపీ కాంప్లెక్స్ ఫైల్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ గ్రామపంచాయతీ నిర్మించిన 23 జిపి కాంప్లెక్స్ లలో అటు వేలం డబ్బులు ఇటు కిరాయి డబ్బులు చెల్లించకుండా యథేచ్ఛగా వాడుకుంటున్న వైనంపై "పంచాయతీ ఆదాయానికి గండి" అనే శీర్షికన నవతెలంగాణ కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన మండల పంచాయతీ అధికారులు వెంటనే జి పి కాంప్లెక్స్ కు సంబంధించిన పూర్తి వివరాలు కార్యాలయానికి తెలియజేయాలని, డబ్బులు పూర్తిగా చెల్లించని వారికి ఏ విధంగా తాళాలు ఇస్తారని పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా 15 రోజులు గడుస్తున్నా నేటికీ జీపి కాంప్లెక్స్ ఫైళ్లు ముందుకు సాగలేదు. సుమారు కోటి రూపాయల పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడుతున్న అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పూర్తిగా డబ్బులు చెల్లించని వారికి దుకాణాన్ని వాడుకోవడానికి తాళాలు ఎలా అప్పగిస్తారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫైళ్ళల్లో కదిలిక వచ్చి ఇటు కిరాయిని అటు వేలంపాట డబ్బులు వసూలు చేస్తారా..? తమకేమీ పట్టనట్టు ఫైళ్లను మూలకు పడేస్తారా వేచి చూడాలి.

మత్తు పదార్థాలను, మాదకద్రవ్యాలను నిరోధించాలి

- అందుకు కలిసికట్టుగా కృషి చేద్దాం : అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమాజానికి పెను సవాలుగా మారిన మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో మరింత గట్టిగా పని చేయాలని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై గట్టి నిఘా పెడుతూ, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కడి నుండి జిల్లాకు చేరుతున్నాయి, ఏయే ప్రాంతాల్లో ఎవరు వీటిని విక్రయిస్తున్నారు, ఏ ప్రాంతాలకు జిల్లా మీదుగా రవాణా జరుగుతోంది, స్థానికంగా ఎక్కడైనా గంజాయిని అంతర పంటగా సాగు చేస్తున్నారా అనే వివరాలకు పక్కాగా గుర్తిస్తూ, వాటి మూలాలను అడ్డుకోగలిగితే చాలా వరకు మత్తు పదార్థాలు వినియోగాన్ని నియంత్రించవచ్చని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వల గురించి ఆరా తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ దిశగా, పోలీస్, ఎక్సయిజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ కోటేశ్వర్ రావు, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శన్, వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, అటవీ, రవాణా, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఐక్య పోరాటాలతో నియంతృత్వానికి అడ్డుకట్ట

- ఫాసిజం వైపు అడుగులేస్తున్న మోడీ
- ప్రభీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరగని పోరాటం' పుస్తకావిష్కరణ సభలో గొర్రెపాటి మాధవ రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇందిరాగాంధీ విధించిన ప్రకటిత ఎమర్జెన్సీకి ఇప్పటి అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యత్యాసాలు ఉన్నప్పటికీ చాలా పోలికలు ఉన్నాయని ప్రభీర్ పుర్కాయస్థ తన రచన "అలుపెరుగని పోరాటం"లో పేర్కొన్నారని మానవ హక్కుల వేదిక కార్యకర్త, ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అన్నారు. ప్రభీర్ పుర్కాయస్థ రచించిన "అలుపెరగని పోరాటం" 'నాటి ఎమర్జెన్సీ నుండి నేటి దాకా' పుస్తకావిష్కరణ సభను మల్లు స్వరాజ్యం స్మారక ట్రస్టు ఏర్పాటు చేసుంది. ఈ సభలో గొర్రెపాటి మాధవరావు పుస్తకాన్ని పరిచయం చేసారు. డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అధ్యక్షత వహించిన ఈ సభకు జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ పాటిబండ్ల రామ్మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు

నాటి ఎమర్జెన్సీలో అంతర్గత భద్రతా నిర్వహణ చట్టాన్ని (మీసా) యథేచ్ఛగా దుర్వినియోగం చేయగా ఇప్పుడు ఈ అప్రకటిత ఎమర్జెన్సీలో అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (ఉపా)ను అంతే మోతాదులో దుర్వినియోగం చేస్తున్నారని ప్రభీర్ సోదాహరణంగా తన పుస్తకంలో వివరించారని మాధవరావు అన్నారు. తప్పుడు గుర్తింపుతో తనను 1975 సెప్టెంబర్ 25న జవహర్లాల్ నెహ్రూ విద్యాలయంలో ఎలా అరెస్టు చేసి సంవత్సర కాలం పాటు మీసా కింద జైల్లోని నిర్బంధించింది పుర్కాయస్థ వివరించాడని చెబుతూ మాధవరావు తన ఎరుకలోని ఒక సంఘటనను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందల్వాయి గ్రామంలో సున్నం నరసింహులు అనే పేరుతో చాలామంది వ్యక్తులు ఉన్నారు. వారిలో ఒకతను రాడికల్స్‌లో చేరాడు అదే పేరు గల ఒక వ్యక్తి బహిర్భూమికి వెళ్ళగా పోలీసులు కాల్చి చంపారు. తర్వాత తప్పుడు గుర్తింపుతో కాల్చేశామని పోలీసులు తరువాత నాలిక కర్చుకున్నారని సభకు గుర్తు చేశారు.

ఎమర్జెన్సీలో న్యాయవ్యవస్థ పతనాన్ని వివరిస్తూ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ జబల్పూర్‌కి శివకాంత్ శుక్లాకు మధ్య జరిగిన కేసును ప్రభీర్ పేర్కొన్నాడని మాధవరావు చెప్పారు. వైవి చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పును అతని కొడుకు అయిన డివై చంద్రచూడ్ నేతృత్వం లోని ధర్మాసనం కొట్టి వేసిందని మాధవరావు అన్నారు.

ఎంత సంక్లిష్ట పరిస్థితుల్లోనైనా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని సస్పెండ్ చేసే అధికారం ప్రభుత్వానికి లేదని జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా తన మైనారిటీ తీర్పులో చెప్పిన అంశాన్ని జనతా పార్టీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత 44వ రాజ్యాంగ సవరణతో మద్దతు పలికిందని మాధవరావు అన్నారు.

ఎలాంటి భావజాలం లేని ఆనాటి ఎమర్జెన్సీ సంజయ్ గాంధీ వీధి గుండాలను సృష్టిస్తే ఇవాల్టి అప్రకటిత ఎమర్జెన్సీకి హిందూత్వ భావజాలం బజరంగ్దళ్ లాంటి పలు సంస్థల గుండాగ్యాంగులకు వనరుగా తయారైందని ప్రభీర్ తన పుస్తకంలో ప్రస్తావించాడని గొర్రెపాటి అన్నారు.

నాటి ఎమర్జెన్సీ సెన్సార్ షిప్ ను విధించి మీడియాను అదుపు చేసిందని, నేటి అప్రకటిత ఎమర్జెన్సీ ప్రధాన స్రవంతి మీడియాను రకరకాల రూపాల్లో బెదిరించి, ప్రలోభ పెట్టి అణిచివేస్తున్నదని భావ ప్రకటన స్వేచ్ఛలో ఇండియా స్థితి అంతర్జాతీయంగా చూస్తే పతనం అంచున ఉందని మాధవరావు అన్నారు. ఇప్పుడు అసమ్మతి గొంతుకలకు ప్రత్యామ్నాయ వ్యవస్థ దొరికిందని ఆనాడు ఇది లేదని ఇదంతా టెక్నాలజీ ప్రజల జీవితాల్లో భాగమైనందునే సాధ్యమైందని ప్రభీర్ చెప్పిన మాటలు మాధవరావు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ఇప్పటి అప్రకటితో ఎమర్జెన్సీ ని సమర్థంగా ఎదుర్కోకపోతే ఫాసిస్టు రాజ్యం ఏర్పడుతుందని ప్రభీర్ హెచ్చరించారని అన్నారు. అందువల్ల ఐక్య పోరాటాలతో మాత్రమే ఈ పరిస్థితిని ఎదుర్కొనగలమని ప్రభీర్ చెప్పిన విషయాన్ని సభ దృష్టికి మాధవరావు తీసుకొచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కె రామ్మోహన్‌రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు హుస్సేన్, ఈవిఎల్ నారాయణ, బన్సీలాల్ రాజేంద్ర, ప్రసాద్ రావు, నూర్జహాన్, సిర్ప లింగం, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై రైడ్

- జిల్లా వ్యాప్తంగా 40 చోట్ల దాడులు.. 30 కేసులు నమోదు



నవతెలంగాణ-మోర్తాడ్/భీంగల్/నవీపేట్

మోర్తాడ్ మండలంలో సోమవారం ఉదయం పోలీసులు వడ్డీ వ్యాపారులపై కొరడా ఝుళిపించారు. సామాన్య ప్రజలకు అధిక వడ్డీలపై రుణాలను దండుకునే వ్యాపారస్తులను గుర్తించి వారి ఇండ్లపై ఉదయం నుండి గస్తీ నిర్వహించి వారి నివాస గృహాలపై దాడి నిర్వహించి వడ్డీ వ్యాపారాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సామాన్య ప్రజల అవసరాలను అణువుగా తీసుకొని అధిక మొత్తంలో వడ్డీలకు డబ్బులను ఇస్తూ వారిని ఇబ్బందులకు గురి చేసే వ్యాపారస్తుల వివరాలను సేకరించి దాడులు చేసినట్టు సమాచారం. బంగారు , నివాస గృహాలు, పంట భూములు తాకట్టు పెట్టుకొని ఐదు నుండి పది రూపాయల వరకు వడ్డీలకు డబ్బులు ఇస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న దాడులలో భాగంగా మోర్తాడులో సోమవారం దాడులు నిర్వహించి పలువురి వడ్డీ వ్యాపారుల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారి నివాసగృహంపై దాడి నిర్వహించి పలు వడ్డీల రికార్డులను తనిఖీ చేసి పూర్తిస్థాయిలో వడ్డీ వ్యాపారస్తులకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకొని పూర్తిస్థాయిలో వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. సామాన్య ప్రజలకు వడ్డీలకు ఇచ్చి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో దాడులు నిర్వహించి ఓ వ్యాపారస్తుడిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది. అధిక మొత్తంలో డబ్బులు వడ్డీలకి ఇచ్చి ఇచ్చినట్లు నిజమైన అయితే మాత్రం ఆ వడ్డీ వ్యాపారస్తుడిపై చట్టపరి చర్యలు తీసుకునే విధంగా అధికారులు రికార్డులను తనిఖీ చేసినా అనంతరమే సమాచారాన్ని బయటకు తెలిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదేవిధంగా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఓ ముగ్గురు చిన్న వడ్డీ వ్యాపారాలు నిర్వహించినట్లు తెలిసింది.

వడ్డీ వ్యాపారులపై నజర్

భీంగల్ : భీంగల్ మండలంలో అధిక వడ్డీలతో జీరో వ్యాపారం చేస్తున్న కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా అధిక వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్న తరుణంలో జిల్లా సిపి ఆదేశాల మేరకు సోమవారం భీంగల్ మండలంలో టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు జరిపి జమనాతు పత్రాలు, నగలు, ప్రాంసరీ నోటీసులు, చెక్కులు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు సిపి ఆదేశానుసారం తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసుల తనిఖీ

నవీపేట్ : మండల కేంద్రంలోని వడ్డీ వ్యాపారి వనం రాజు ఇంట్లో సిఐ సతీష్ కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తనిఖీ చేశారు. నిబంధనలకు మించి వడ్డీ వసూలు చేస్తూ సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉండడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు వడ్డీ వ్యాపారుల ఇంటిపై తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇంట్లో దొరికిన పత్రాల ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి నీటి సాసర్లు ఏర్పాటు


నీటి సాసర్లలో నీరు నింపుతున్న అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల
ఎండ వేడిమిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చుడాని కోసం ఏర్గట్ల సోమవారం మండల కేంద్రంలోని భీమన్న గుట్ట, దానిపక్కన ఉన్న అటవీ పరిసర ప్రాంతాల్లో ఐదు నీటి సాసర్లను ఏర్పాటు చేసినట్లు కమ్మర్ పెల్లి రేంజ్ ఫారెస్ట్ అధికారి రాథోడ్ తుకారం తెలిపారు. ప్రజలు మూగ జీవాల కోసం తమవంతుగా వేసవి కాలంలో నీటి వసతి కల్పించి వాటి మనుగడకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు బీట్ ఆఫీసర్ లింగన్న ఉన్నారు.

ఏఐటిటికి ఈనెల 19 వరకు అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ప్రైవేట్ క్యాండిడేట్స్‌కి సిటిఎస్ (క్రఫ్టమెన్ ట్రెనింగ్ స్కీం) అల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటిటి) - 2024 రాయడానికి అవకాశం కల్పించిందని, ఐటిఐకి సంబందించిన ఏదేని ట్రేడ్ లలో అనుభవం ఉన్న అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్ పరీక్షలకు ఏఐటిటి (అల్ ఇండియా ట్రెడ్ టెస్ట్) హాజరయ్యే సువర్ణావకాశాన్ని ఉపాధి, శిక్షణ శాఖ కల్పిస్తున్నట్లు నిజామాబాద్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ ఎం. కోటి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో ఒకటి, రెండు సంవత్సరాల కోర్సులకు ఏదైనా ట్రేడ్ కి సంబందించిన ఏదైనా ప్రైవేట్ లేదా గవర్నమెంట్ సంస్థల్లో మూడు (3) సంవత్సరాల అనుభవం కలిగి ఉండి, ఆ ట్రేడ్‌లో సర్టిఫికేట్ ఎన్ టి సి (నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్) పొందుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19 లోపు వరంగల్ లోని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ప్రభుత్వ ఐటిఐ కళాశాల, ములుగు ఎక్స్ రోడ్ వరంగల్‌లో నేరుగా వెళ్ళి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎలిజిబిలిటీ క్రైటీరియా మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 9441784849, 9866499110ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి


మినీ వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
ప్రజలు నీటిని వృధా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని, నాగపూర్ గ్రామంలో పలు కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకులను, మినీ వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. నీటి సమస్యలపై పలు నివాస గృహాలను సందర్శించి ప్రజలతో మాట్లాడి నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయన నాగపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎక్కడైనా పైప్‌లైన్ మరమ్మతులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్నతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శాంతి కుమార్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ దాతలకు సన్మానం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
ఆలూర్ మండల కేంద్రంలో ముత్యాలమ్మ గుడి వద్ద నూతనంగా చిలుకల చిన్నమ్మ గుడి నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన దాతలకు సన్మానం చేశారు. గుడిని ర్మాణంకోసం స్థలం సరిపోకపోవడంతో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల విన్న పం మేరకు మునిపల్లి గ్రామానికి చెందిన బాయి లింబన్న, ఆర్మూర్‌కు చెందిన మగ్గిడి రాజేశ్వర్, సాధుల శ్రీనివాస్ దేవాలయం కోసం సుమారు 500 గజాల భూమిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వారిని సోమవారం మందిర ఆవరణలో సన్మానించి గ్రామస్తుల తరపు న ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, హనుమాన్ దీక్ష స్వాములు గ్రామస్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుని కార్యక్రమాలు అభినందనీయం


సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలో 15 సంవత్సరాలుగా వ్యక్తిగతంగా స్వచ్ఛందంగా విద్యార్థులకు వృద్ధులకు వివిధ అనాథ ఆశ్రమాలకు సేవలందిస్తున్న ప్రముఖ సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం కార్యాల యంలో వారి సేవలను చూసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, త్వరలో మీ సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గుర్తింపు తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా పట్వారి తులసి వారికి ధన్యవాదాలు తెలిపి పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా నిధులు వచ్చే విధంగా చూసి ఆర్మూర్ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. తదనంతరం వినయ్ రెడ్డికి జ్ఞాపికను పట్వారీ తులసి అందజేశారు. కార్యక్రమంలో చిట్టి రెడ్డి, జిమ్మీ రవి, శ్రీనివాస్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ అవగాహనపై ముగ్గుల పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం


పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ ద్వారా మహిళలు సందేశాన్నిచ్చేలా ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. ఈ పోటీలలో సుప్రియ మొదటి బహుమతి గెలుచుకోగా, రెండవ బహుమతి అర్చన, మూడవ బహుమతిని స్రవంతి, వినోద లు దక్కించుకున్నారు. ఈ ముగ్గుల పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, ఎంఈఓ ఆంధ్రయ్య, వేల్పూర్ మండల డిప్యూటీ తహసిల్దార్ సరిత, ఏపీఎం కుంట గంగారెడ్డి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ కుమార్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల బూత్ లెవెల్ అధికారులు, సెర్ప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన
ఎంపీ అరవింద్‌ను ఓడిద్దాం

- రైతు జేఏసీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

రైతులను మోసం చేసిన, ఇచ్చిన మాట తప్పిన అబద్ధాల అరవింద్ ను ఓడిద్దాం అని రైతుజేఏసి కన్వీనర్ ప్రభాకర్ రైతుఐక్యకార్యాచరణ కమి టీ కన్వీనర్ అన్వేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ భవన్ లో రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆర్మూర్ డివిజన్ కమిటీ, రైతు ఐక్యవేదిక ఉమ్మడి జగిత్యాల జిల్లా కమిటీల సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకొని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతు ఓట్లతో గెలిచి రైతులకే శఠగోపం పెట్టిన ఎంపీ అరవింద్ నిస్సిగ్గుగా అబద్దాలు ఆడి రైతులను వంచించడం సిగ్గు చేటన్నారు. పసుపు బోర్డు తెస్తానని బాండ్ రాసి ఇచ్చి దేశ ప్రధాని మోడీతో పసుపు బోర్డు అనే అబద్ధపు ప్రకటన ప్రకటించి రైతులకు మొండి చెయ్యి చూపారన్నారు. ఎన్నికలు వస్తున్నాయి అని మళ్ళీ రైతులను వంచించడానికి కొత్త తెర లేపారని, అందులో భాగంగానే అబద్దాల్లో ఆరితేరిన అరవింద్ ప్రధాని నోటితో కూడా అబద్దాలు ఆడించి అబద్దపు ప్రకటన చేపించారని అన్నారు. ప్రధాని ప్రకటించిన దానికి సంబందించిన కేంద్ర ప్రభుత్వం నుండి ఎలాంటి నోటిఫికేషన్ కానీ, సర్క్యులర్ కానీ, నిధులు కానీ, స్థలం ఎంపిక కానీ ఇప్పటికి స్పష్టత లేదని అందుకే అది మోసపూరిత మైన ప్రకటన అని చెప్పక తప్పదని అయన పేర్కొన్నారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ శక్తుల్లో కేంద్రీకరించే విధంగా మోడీ ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని, అందుకే పసుపు పంటను కూడా వారికి అప్పచెప్పేందుకే రైతులను ముఖ్యంగా పసుపు రైతులను బలిపశువు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన బాధ్యత రైతులపై ఉన్నదని, ఆప్రకారంగానే రైతులు నిజామాబాద్ పార్లమెంట్ అంతటా సభలు, పాదయాత్రలు, సమావేశాలు నిర్వహించి ప్రధాని మోడీ, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్‌ను ఓడించాలని తెలిపారు. మరోదశ రైతు ఉద్యమానికి శ్రీకారం చూడతామని అన్నారు. రైతులు అంత సంఘటితంగా ఈ ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రైతులు తమ సంఘటిత శక్తిని చాటాలి
రైతుజేఏసికన్వీనర్ అన్వేష్
రైతులు తమ సంఘటిత శక్తిని చాటాని రైతుజేఏసి కన్వీనర్ అన్వేష్ అన్నారు. రైతులను మోసం చేసిన బిజెపి నేతలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని అయన అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు విషయంలో రైతులను మోసం చేసిన వీరి మోసపు నక్కజిత్తులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆర్మూర్ డివిజన్, రైతు ఐక్యవేదిక ఉమ్మడి జగిత్యాల జిల్లా కమిటీల కన్వీనర్లు దేవారం, సూర్ఖిర్యాల. లింగారెడ్డి, నారాయణ రెడ్డి, రామకృష్ణ, నాయకులు ఓ.యాదగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మంథని. గంగారాం, పాపయ్య, బాబన్న లింబాద్రి, దామోదర్, సర్పంచ్ సాయిలు, గ్యామ. గంగారాం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ప్రజల్లో విసుగు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-సిరికొండ


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

గత పది సంవత్సర కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పై తెలంగాణ రాష్ట్ర ప్రజలు విసుకు చెందారని, అందుకే కాంగ్రెస్ పార్టీలోకి అడుగుపెడుతున్నారని ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్టంలో ఏం అభివృద్ధి చేయలేదని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీల అమలు కళ్లకు కనిపించడం లేదా అని తెలిపారు. నీళ్ల నిధులు నియామకాలు అనే అంశంతో ఏర్పరచుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి పది సంవత్సరాలు కాలం వెళ్లబుచ్చారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 21 ప్యాకేజీ ద్వారా సాగునీటిని అందిస్తానని ప్రజలను మోసం చేశాడని అన్నారు. ఏడాది కాలంలో 21 ప్యాకేజ్ ద్వారా సాగు నీరు రైతులకు అందిస్తానని అన్నారు. రైతులపై తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 450 ఉన్న గ్యాస్ సిలిండర్‌ను గడచిన పది సంవత్సరాల కాలంలో 1200 కు కేంద్ర ప్రభుత్వం పెంచిందని, కరెంటు బిల్లు , ముడిచమురు ఇంధనం, నిత్యావసర వస్తువులపై జీఎస్టీ పేరుతో సామాన్య ప్రజలపై అధిక భారం కేంద్ర ప్రభుత్వం వేసిందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా నిజామాబాద్ ఎంపీగా ఉన్న అరవింద్ ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, ఈసారి ప్రజల ఓట్లతోనే ఎంపీ అరవింద్ కి సమాధానం చెబుతారని అన్నారు.

పోడు భూముల సమస్యలు తీరుస్తామని, గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని తెలిపారు. ఈసారి ఎంపీగా తనను గెలిపిస్తే రూరల్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. అనంతరం సిరికొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే రేకుల పల్లి భూపతిరెడ్డి, మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్స రెడ్డి, నగేష్ రెడ్డి, డి సి సి కార్యదర్శి మానాల మోహన్ రెడ్డి , గడిల రాములు, వెల్మ భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకారం రవి, ఉమ్మాజీ నరేష్, దేగం సాయన్న, నర్సారెడ్డి, ఎర్రన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటరుగా
నమోదు చేసుకోవాలి

- తహసీల్దార్ ఆంజనేయులు


మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఆంజనేయులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని,

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు కచ్చితంగా మే 13న లోక్ సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రలోభాలకు లొంగకుండా సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. ఈనెల 25 లోపు ఓటు హక్కు కోసం బిఎల్ఓల దగ్గర లేదా మీ సేవ కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ కార్డుల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకునేందుకు ఈనెల 25వ వరకు అవకాశం ఉందని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, ఎంఈఓ ఆంధ్రయ్య, వేల్పూర్ డిప్యూటీ తహసిల్దార్ సరిత, ఏపీఎం కుంట గంగారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, బూత్ లెవల్ అధికారులు, సెర్ప్ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత
కాంగ్రెస్ బండారం బయటపడుతుంది

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-భీంగల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పరిస్థితి పార్లమెంట్ ఎన్నికల తర్వాత బండారం బయటపడు తుందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మెరీడియన్ ఫంక్షన్ హాల్ లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం లో రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని అది పార్లమెంట్ ఎన్నికల తర్వాత బయట పడుతుందన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నామరూపం లేకుండా పోతుందన్నారు. దొంగ హామీలను ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డి మాట్లాడుత..

ఇక్కడి ప్రజల చిరకాల కోరక మే రకు పార్లమెంట్‌లో ప్రయివేట్ బిల్లు పెట్టానని దానికి మద్దతు కావాలంటే బాజీ రెడ్డి గోవర్ధన్ లాంటి వారు ఎంపీ కావాలని. అందుకు బాజిరెడ్డి గోవర్దన్ ను సంపూర్ణ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బాజారెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు కేసీఆర్‌ను వదులుకొని బాధపడుతున్నారని, రేవంత్ రెడ్డి జూట మాటలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడని అందుకు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందని, కనుక పార్లమెంటులో కూడా మన ప్రాంత గళం వినిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి తనని గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సివివి, ఓటిపి
సమాచారం చెప్పొద్దు

- సైబర్ నేరాలపై అవగాహన


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్
తెలంగాణ విశ్వవిద్యాలయం సారంగాపూర్ బీఈడీ కళాశాలలో నిజామాబాద్ జిల్లా ఆరవ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ వారి సిబ్బందితో కలిసి కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నియంత్రణపై, మాదకద్రవ్యాల వాడడం వల్ల కలిగే అనర్థాలను గురించి ఈ కార్యక్రమంలో ఆరవ టౌన్ ఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రజలు వాటి నుండి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తెలిసి తెలియని వెబ్సైట్ల లింకులను అనవసరంగా క్లిక్ చేయవద్దని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్స్ కాల్స్, వారు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఎకౌంట్‌కు సంబంధించిన సమాచారం, సివివి, ఓటిపి లాంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియజేయ కూడదని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వన్నెల్ దాస్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్. రవీందర్, అధ్యాపకులు, సువర్చల పోలపల్లి శ్రీకాంత్, హరిత, నరేందర్, పోశెట్టి, నరసింహారెడ్డి, సుజిత్, ప్రసాద్, శశి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దేశంలో
అంబేద్కర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్


ఇజ్రాయిల్‌లో అంబేద్కర్ జయంతిని నిర్వహిస్తున్న నాయకులు

ఇజ్రాయిల్ దేశంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో 133వ అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ ప్రారంభానికి ముందు పంచశీల జెండాను యూత్ సభ్యులు ఎగురవేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ బలోపేతానికి కృషి చేసిన ఆర్మూర్ వేల్పూర్ ప్రాంతాలకు చెందిన సీనియర్లు పస్క సుధాకర్, బన్నీ, నీరడీ ప్రకాష్‌లకు యూత్ సభ్యులు సన్మానించారు. ఈ సభకు థింక్ స్మార్ట్ రాజ్ కుమార్ అధ్యక్షత వహించగా నీరడి ప్రేమనందు, రజినీకాంత్, సుమన్, ప్రమోద్, ప్రవీణ్ తదితరులు తమ మాట పాటలతో సభికులను ఉత్సాహపరిచారు,

కార్యక్రమంలో తెలంగాణలో వివిధ ప్రాంతాల నుండి వచ్చి ఇజ్రాయిల్ లో ఉన్న సీనియర్లు, జూనియర్లు సుమారు 100 మంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ మజార్ (35) అదృశ్యమైనట్టు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ మజార్ డ్రైవర్ పనిచేస్తూ జీవించేవాడు. 30.3.2024 ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరు చెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. అతని భార్య ఐదు సంవత్సరాల కిందట అతని నుంచి దూరంగా ఉండటం వల్ల, ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళిపోయాడని ఆమె తల్లి బీబీ ఫాతిమా ఇచ్చిన దరఖాస్తు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఇతని ఆచూకీ తెలిస్తే కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ తెలపాలని సిఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి.. వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

చేపలు పట్టేందుకు వెళ్లి.. తన భర్త తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పీఎంహెచ్ కాలనీకి చెందిన మహమ్మద్ రహీం (40) అనే వ్యక్తి 13.4.2014న ఇంట్లో తన భార్య అయిన కమ్రున్నిసతో తాను చేపలు పట్టడానికి వెళుతున్నాను అని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. తిరిగిరాలేదు. ఫోన్ చేస్తే ఫోను కలవడం లేదు. ఆయన ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా లభించలేదు. దీంతో భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆయన ఆచూకీ తెలిసిన ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో తెలపాలని సూచించారు.

ఫ్లోరింగ్‌కు నిధుల్లేవ్

మహిళా మండలి భవనం పూర్తయ్యేదెన్నడో..?

- సాలంపాడ్ క్యాంప్‌లో ఫ్లోరింగ్ పూర్తికాక నిలిచిన భవనం

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో నూతంగా నిర్మించిన లైబ్రరీ, మహిళా మండలి భవనం పనులు ప్రారంభించి భవన నిర్మాణం పూర్తి చేసినా అందులో చివరి దశలో మిగిలిన ఫ్లోరింగ్ పనులు పూర్తికాలేదు. దాంతో మహిళ మండలి భవనం పూర్తయ్యేదెన్నడంటూ మహిళా సంఘాల వారు ఎదురుచూస్తున్నారు.

2021-22 సంవత్సరానికి గాను ఎమ్మెల్సీ కవిత సిడిపి నిధులతో మంజూరైన 5 లక్షల రూపాయల నిధులతో మహిళ మండలి భవనం, మరో 5 లక్షల రూపాయల నిధులతో లైబ్రరీ భవనాన్ని నిర్మించారు. అంతవరకు బాగానే ఉన్నా భవనం పూర్తి చేసి రంగులు వేసి సిద్ధం చేశారు. కానీ భవనం లోపల ఫ్లోరింగ్ పనులు చేయకుండా నిలిపివేయడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో ఆ ప్రాంతం చెత్తకుప్పల మారింది. మహిళ భవనం లేక మహిళ సంఘాల వారు సమావేశం నిర్వహించుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అలాగే ప్రస్తుతం ఉద్యోగ అవకాశాల కోసం పోటీ పడుతున్న నిరుద్యోగులు చదువుకోడానికి లైబ్రరీ లేక ఇబ్బంది పడుతున్నారు.



పూర్తి కాని ఫ్లోరింగ్ పనులు



సాలంపాడ్ క్యాంప్‌లో నిర్మించిన లైబ్రరీ, మహిళా మండలి భవనం

ఫ్లోరింగ్ పనులకు నిధులు లేక..

భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంపై పంచాయతీరాజ్ ఏఈ సాయిలును ఫోన్‌లో వివరణ కోరగా ఇప్పటి వరకు చేసిన పనులకు ఎం.బీ. రికార్డు చేశామని, మిగిలిన ఫ్లోరింగ్ పని చేయడానికి నిధులు లేవని దాంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. కాంట్రాక్టర్ మిగతా ఫ్లోరింగ్ పని పూర్తి చేస్తా అని చెప్పినట్లు ఏఈ తెలిపారు. ఫ్లోరింగ్ చేయడానికి నిధులు లేవని ఆ పని పూర్తి చేయడానికి అదనపు నిధుల కోసం ప్రతిపాదిస్తామని ఆయన తెలిపారు. పది లక్షలతో భవనం పూర్తి చేసినా ఫ్లోరింగ్ చేయడానికి నిధులు లేక దానిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా మారింది . 10 లక్షలతో భవనం నిర్మించిన చివరికి ఫ్లోరింగ్ చేయడానికి నిధులు లేవని ఆపేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులను, కాంట్రాక్టర్లను అడిగే వారు లేక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గత కొన్ని నెలల నుంచి ఈ భవనం నిరుపయోగంగా మారింది. దాంతో ప్రభుత్వ నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. అధికారులు ఇప్పటికైనా మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో కేవలం ఆరవ తరగతి విద్యార్థినులకు మాత్రమే ఖాళీలు ఉన్నాయని పాఠశాల నిర్వాహకురాలు శ్యామల తెలిపారు. మిగతా తరగతులలో ప్రవేశానికి ఖాళీలు లేవని, ఆరవ తరగతిలో కూడా 25 నుంచి 30 మంది విద్యార్థులకు అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగలవారు జూన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య



నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ గోవింద్‌పూర్ శివారు నివాస ప్రాంతంలో సోమవారం ఉదయం తెల్లవారుజామున ఎడపల్లి గ్రామానికి చెందిన మేఘన (14) అనే మైనర్ తన ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మేఘన అనే బాలిక ప్రస్తుతం ఎడపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. సోమవారం ఆ బాలిక పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. ఇంట్లో ఉన్న కుటుంబ కలహాలతో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొనుగోలు సజావుగా చేపట్టాలి

- జిల్లాలో ధాన్యం సేకరణ భేష్
- కితాబు ఇచ్చిన పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీ దేవేంద్రసింగ్ చౌహాన్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ తీరు, మౌలిక సదుపాయాలు బాగున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహన్ సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఒడుదుడుగులు లేకుండా సజావుగా, వేగవంతంగా జరిగేలా చూడాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు తెచ్చిన ధాన్యం తేమ శాతం పరిశీలించి కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తేమ కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గోనెసంచుల కొరత లేదని స్పష్టం చేశారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా వ్యవసాయ, సహకార అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి,మద్దతు ధరపై రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. రెవిన్యూ, పౌరసరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ, ఐకెపి వంటి అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేపట్టాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా చూడాలన్నారు. నిర్ణీత గడువులోగా రైస్ మిల్లులో యజమానులు తమ లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైస్ మిల్ యజమానుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. గత యాసంగితో పోలిస్తే ఏడాది ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. అంతకు ముందు బిక్కనూరు మండలం బస్వాపూర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారులు వసతులు ఏర్పాటు చేసినందుకు సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 22,894 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసి 13 కోట్ల రూపాయలు రైతులకు అందజేశామని తెలిపారు. జిల్లాలో గన్ని బ్యాగుల కొరత లేదని చెప్పారు. ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌరసరపర అధికారి మల్లికార్జున బాబు, జిల్లా పౌరసరపర ఇంచార్జ్ మేనేజర్ నిత్యానంద్, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇసుక వేలం



ఇసుక వేలం పాటలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్ సమక్షంలో ఇసుక వేలంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ నవీన్ మాట్లాడుతూ.. పట్టుకున్న మూడు ట్రాక్టర్ల ఇసుకను వేలంపాట ద్వారా విక్రయించామని తెలిపారు. ఒక్క ట్రాక్టర్ ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక ధర రూ.1456 ఉండగా దానిని రూ.8100కు కుమ్మరి అశోక్ అను ఎల్లారెడ్డి వాసి దక్కించుకున్నట్టు తెలిపారు. మిగతా రెండు ట్రాక్టర్ల ఇసుకను 2000 చొప్పున గైని జగన్, అంగగౌడ్ దక్కించుకున్నారని ఆయన తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వానికి 12,100 రూపాయలు లాభం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సాయిబాబా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్



వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో ఇటీవల దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం గాంధారి మండల కేంద్రంలో గల సోయక్ పాషా ఇంట్లో దొంగతనం జరిగిన విషయంలో జగిత్యాల జిల్లా మెట్పల్లి గ్రామానికి చెందిన నిందితుడు అయిన వల్లెపు కాశిరాంను సోమవారం ఉదయం బాన్సువాడ నందు అతని మామ ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల దొంగిలించిన సొమ్మును, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని నేరస్తుడైన కాశీరాంను జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపారు. ఇతను పాత నేరస్తుడు కాగా.. ఇంతకుముందు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. అలాగే పీడీ యాక్ట్ నందు ఒక సంవత్సరం జైలుకు వెళ్లి వచ్చాడు.

మండుటెండలో పనులు

- చట్టంలోని నిబంధనలు నిర్వీర్యం

నవతెలంగాణ-రెంజల్

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పేదలకు కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పనిచేసే కూలీలకు మాత్రం సరైన సౌకర్యాలు కల్పించడం లేదు.

'ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలి. కూలీలకు సౌకర్యాలు కల్పించాలి.' అని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. వేసవి కాలం అయినందున ఉదయం నుంచే భానుగ భగభగమంటున్నాడు. అయితే పనిచేసే ప్రదేశంలో నీడలేక కూలీలు మండుటెండలోనే పనిచేయాల్సి వస్తోంది. ఇటీవల సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదిక కూలీలకు సౌకర్యాలు కల్పించాలని క్షేత్ర సహాయకులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే పనులను జరిపిస్తుండడం శోచనీయమని కూలీలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లను క్షేత సహాయకులు తీసుకువచ్చి కూలీలకు అందుబాటులో ఉంచినప్పటికీ టెంట్లు మాత్రం ఇవ్వకపోవడంతో వారు మండుటెండలోని పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రతి గ్రామానికి టెంట్లు సరఫరా చేయాలని కూలీలు కోరుతున్నారు.



ఎండలోనే ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలు

నలుగురు చిట్‌ఫండ్ నిర్వాహకుల రిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఎల్‌వీఎస్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే చిట్ ఫండ్ కంపెనీ యజమానులైన బిల్ల దశరథ్‌రెడ్డి, బిల్ల పద్మావతి, బిల్ల నితీష్‌రెడ్డి, బిల్ల అచ్యుత్‌రెడ్డిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం.. తేదీ 14.4.2024న అహ్మద్ మొహియుద్దీన్ అనే వ్యక్తి బిల్ల దశరథ్ రెడ్డి, బిల్ల పద్మావతి, బిల్ల నితీష్ రెడ్డి, బిల్ల అచ్యుత్ రెడ్డిలు తనతో చిట్టి డబ్బులు కట్టించుకుని చిట్టి డబ్బులు ఇవ్వడం లేదని దరఖాస్తు చేశాడని, ఆ దరఖాస్తుతో వారిపై కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పైన నలుగురు వ్యక్తులు కామారెడ్డిలో ఎస్బిఐ బ్యాంకుపైన ఎస్ఎల్‌వీఎస్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరు మీద చిట్టీలు నడిపే కంపెనీని స్టార్ట్ చేశారు. కాగా దానిలో అతడు రెండు చిట్టీలు వేయగా.. చిట్టి అమౌంటు మెచ్యూరిటీ అయిపోయిన తర్వాత కూడా ఇవ్వలేదు. ఇలాగే చాలామందికి చిట్టి ఎత్తుకున్న తర్వాత కూడా డబ్బులు ఇవ్వకుండా మోసం చేసి పారిపోయే ప్రయత్నం చేయడంతో బాధితులు రిజిస్టార్ ఆఫ్ చిట్స్ నందు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు కామారెడ్డి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 25 - 30 మంది బాధితులను గుర్తించారు. వీరి వద్ద నుండి స్టేట్మెంట్లు రికార్డు చేసి కొన్ని డాక్యుమెంట్లను కలెక్ట్ చేశారు. ఈ చిట్‌ఫండ్ కంపెనీ కామారెడ్డిలోనే కాకుండా ఆర్మూర్, నిజామాబాద్, కొంపల్లి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, షాద్‌నగర్, మెట్పల్లి, వనపర్తి తదితర ఏరియాలలో 10 బ్రాంచ్‌లతో ప్రారంభించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. అంతేగాక కామారెడ్డి చుట్టుపక్కల పరిధిలో ఉన్న దాదాపుగా 30 చిట్టీలను వేసిన వ్యక్తులకు సంబంధించి సుమారు రెండు కోట్ల రూపాయల మేర మోసం జరిగినట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ విషయంలో ప్రాథమిక విచారణలో బిల్లా దశరథ్ రెడ్డి అనే వ్యక్తి ఉపాధ్యాయుడు అని, అతని భార్య పద్మావతి, కొడుకు నితీష్ రెడ్డి పేరు పైన చిట్ ఫండ్ కంపెనీ ప్రారంభించారు. అనంతరం వారి వద్ద నుండి ఐదు సెల్‌ఫోన్‌లను, కారును, కొన్ని చిట్టిలకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.



చిట్‌ఫండ్ నిర్వహకులను విచారణ చేస్తున్న సీఐ

ప్రజలకోసం పోరాటం చేసే పార్టీ బీఆర్ఎస్

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-గాంధారి/బాన్సువాడ

ప్రజల కోసం ఎల్లప్పుడూ పోరాటం చేసే పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మారుతీ ఫంక్షన్ హాల్‌లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పార్టీ గాంధారి మండల కార్యకర్తల విస్తత స్థాయి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ శాసన సభాపతి, మంత్రి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ శాసన సభ్యులు జనార్ధన్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకోసం ఎల్లప్పుడూ పోరాటం చేసే ఒకే ఒక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని.. ప్రతి కార్యకర్త సైనికునిగా కష్టపడి జహీరాబాద్ గడ్డపై గులాబీ జండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. 25 రోజులు కష్టపడి ప్రతి కార్యకర్త పనిచేస్తే గులాబీ జెండా జహీరాబాద్ గడ్డపై ఎగరం ఖాయమని ఆయన అన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానాని ఆయన అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గాంధారి : మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : జహీరాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చూసి ఆశపడి ప్రజలు ఓట్లు వేశారని, కానీ ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు హామీలు అమలు కాలేదన్నారు. హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని, కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అందరం కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనీల్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, బాన్సువాడ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షులు బద్యానాయక్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసు నిందితుల రిమాండ్

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని కోస్లీ లిఫ్ట్ కాలువలో చంద్ర కళ (46)ను హత్య చేసిన ఇద్దరు నిందితులు గంగాధర్, గోదావరిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ సతీష్ కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. రెంజల్ మండలం బోర్గం గ్రామానికి చెందిన చంద్రకళను 50 వేల రూపాయలు అప్పు చెల్లించాలని కోరడంతో అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలిద్దరూ గంగాధర్, గోదావరి నమ్మించి ఇంటికి పిలిచి హత్య చేసి ఆమె మెడలోని గుండ్లు, పట్ట గొలుసు తీసుకొని అలీ సాగర్ లిఫ్ట్ కాలువలో పడేశారని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి వద్ద నుండి తీసుకున్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష

- మద్యం సేవించి వాహనం నడిపినందుకు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష మెజిస్ట్రేట్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటరమణ సోమవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనం నడిపిన 27 మందికి ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ కౌన్సిలింగ్ నిర్వహించిన తదనంతరం మార్నింగ్ కోర్టులో మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ముందర హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ 25 మందికి 24100రూపాయల జరిమానా మరో, ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని ట్రాఫిక్ ఏసిపి నారాయణ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం గొల్ల గుట్ట తండాకు చెందిన నరేష్ నాయక్ దేగావత్‌కు రెండు రోజులు, అలాగే మోస్రా గ్రామానికి చెందిన సంతోష్ గౌడ్‌కు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సిఐ చెప్పారు.

లయన్ నివేదన్ గుజరాతికి అవార్డు



అవార్డు అందుకుంటున్న లయన్ నివేదన్ గుజరాతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్‌కు 86 వేలు (1000 డాలర్లు) విరాళంగా ఇచ్చినందుకు సోమవారం 320డి జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మి ప్రశంస పత్రం, అవార్డు ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం హైదరాబాద్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320డి జిల్లా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో ప్రతి సభ్యుడు ఇచ్చే విరాళాలు ప్రపంచ వ్యాప్తంగా నిరుపేద ప్రజలకు ఆయా అవసరాలకు స్వచ్ఛందంగా ఉపయోగపడతాయని వారు కొనియాడారు ఇట్టి అంతర్జాతీయ లయన్స్ క్లబ్‌లో సామాజిక సేవలు చేయడానికి సభ్యులు సభ్యత్వం తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రీన్ అధ్యక్షులు జెంటిల్ కిడ్స్ ప్రకాష్ కార్యదర్శి రాజేష్, కోశాధికారి కుంటాల నరేందర్ ప్రతినిధులు డీకే రాజేష్,చేపూర్ గనేశ్, ఆకుల రాజు, స్వామి,,శ్రీనివాస్, కృష్ణ దొండి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు మండల ఓబీసీ ఉపాధ్యక్షుడిగా ఇస్సపల్లి గంగాధర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండల ఓబిసి ఉపాధ్యక్షులుగా కల్లెడ గ్రామ మాజీ ఎంపీటీసీ ఈసాపల్లి గంగాధర్‌ను నియమించారు. ఈ సందర్భంగా బిజెపి ఆలూర్ అధ్యక్షులు కొత్త్తారు గంగాధర్ (గిరీష్) సోమవారం నియామక పత్రం గంగాధర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల ఓబిసి అధ్యక్షులు నడిసరం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలును ప్రారంభిస్తున్న అబ్దుల్‌బారి

నవతెలంగాణ - మెండోర

మండలంలోని సావెల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.ఈ సంధర్బంగా సావెల్ సొసైటీ ఆడిటర్ మెండోర మండల మానిటర్ అబ్దుల్ బారి ధాన్యాన్ని తూకంవేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు, సొసైటీ సహాయక సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకిలో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-మోపాల్

సోమ వారం రోజున బోర్గం (పి) గ్రామ శివారులో గల భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మంచిప్ప గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో తూర్పు రాజేష్ గుడుగుల శ్రీనివాస్ గోవిరి నరేష్, మహేష్, భాస్కర్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మద్యం మత్తులో ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం

- పోలీస్ కమిషనరేట్ ఎదుట.. కారులో ఉన్న వ్యక్తులపై దాడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోగల పోలీస్ కమిషనరేట్ ఎదురుగా ఏఆర్ హెడ్ క్వార్టర్ వద్ద ఆదివారం రాత్రి ఓ కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. మద్యం మత్తు లో ఏఆర్ కానిస్టేబుల్ స్కూటీపై వెళ్తూ కారులో వెళ్తున్న వారిపై దాడి పాల్పడ్డాడు. నగరంలోని ఒకటవ టౌన్ పరిధిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయం గేటు ముందే ఏఆర్ కానిస్టేబుల్ ఆయూబ్ స్కూటీపై వెళ్లుతుండగా కారులో సాయి తేజ ఫ్యామిలీతో అటువైపు వెలుతు న్నారు. స్కూటీని కారు ఢీకొట్టిందని కారును ఆపి నడిపిస్తున్న వ్యక్తి నుంచి బలవంతంగా ఆర్సీ తీసుకున్నాడు. కారులో ఉన్న మహిళలు కానిస్టేబుల్‌ను బతిమిలాడిన వినిపించుకోలేదు. దీంతో కారులో ఉన్న వారిపై దురుసుగా ప్రవర్తించి, దాడి చేశాడని బాధితులు ఆరోపించారు. సీపీ కార్యాలయం ఎదుట అరగంట పాటు ఈ తతంగం జరిగిన అక్కడి పోలీసులు పట్టించుకోలేదు. ఒకటవ టౌన్ ఎహెచ్వో విజయ్ బాబు విధులు ముగించుకొని ఇంటికి వెలుతుం డగా పోలీసు వాహనం ఆపి అక్కడికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఆర్ కానిస్టే బుల్ ఆయుబ్ నుంచి ఆర్సీ తీసుకొని కారులో ఉన్న వారికి ఇచ్చారు. అక్కడి నుంచి ఏఆర్ కానిస్టేబుల్‌ను పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లి డ్రంక్ అండ్ డ్రైవ్ చేయగా మద్యం సేవించాడని ఎస్హెచ్వో తెలిపారు. బాధితులు ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సీపీ కార్యాలయం ఎదుట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి విచా రణ చేపట్టి మాకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎంపీడీవో సతీష్ కుమార్
- అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/భీంగల్ రూరల్/కమ్మర్‌పల్లి

మండలంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో సతీష్ కుమార్ సోమవారం అన్నారు. మండలంలోని అర్గుల్, జక్రాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ కమిటీలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈ, సూపరింటెంట్ బ్రహ్మానందం, ఏపిఎం రవీందర్ రెడ్డి, గ్రామ సంఘం అధ్యక్షులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

భీంగల్ రూరల్ :మండలంలోని బెజ్జోర, పురాణిపేట్, జగిర్యాల, దేవనపల్లి గ్రామాల్లో జడ్‌పీహెచ్ఎస్ పీఎస్ యూపీఎస్ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. టాయిలెట్ రిపేర్, కొత్తగా నిర్మాణం, తాగు నీటి సౌకర్యం, మేజర్, మైనర్ ఎలక్ట్రికల్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఎంఈవో స్వామి, ఏఈ మేఘన, ఏపీఎం రవీందర్, సీసీలు శ్రీనివాస్, నరేష్, స్కూల్ హెడ్ మాస్టర్లు, విఓల అధ్యక్షులు, వీఓఏలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని నాగపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మరుగుదొడ్లను ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సోమవారం సందర్శించి పరిశీలించారు.ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్ల పరిస్థితి, చేపట్టాల్సిన మరమ్మత్తులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల మరమ్మతులకు ఎంత ఖర్చవుతుందని తెలుసుకునేందుకు స్థానిక ఆంధ్ర మేస్త్రితో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించిన ఆయన పాఠశాలలో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరమున్న పనులపై అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో చర్చించారు. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన పనులను గుర్తించి అవసరమైన నిధుల కోసం నివేదికలు సిద్ధం చేయాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్యకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్య, సీసీ నవీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.



జక్రాన్‌పల్లి : మాట్లాడుతున్న ఎంపీడీవో



కమ్మర్‌పల్లి : మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వడ్డీ వ్యాపారులపై దాడులు

40 చోట్ల దాడులు, 30 కేసులు నమోదు

నవతెలంగాణ-/కంఠేశ్వర్/ఆర్మూర్/జక్రాన్‌పల్లి

వడ్డీ వ్యాపారులపై నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 40 చోట్ల దాడులు నిర్వ హించి 30 కేసులు నమోదు చేసినట్లు నిజామా బాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుండి కోట్ల రూపా యలు విలువైనటువంటి ప్రామిసరీ నోట్లు, పట్టా పాస్ బుక్కులు, ఏటీఎం కార్డులు, నగదు స్వాధీనం చేసు చేసుకు న్నట్లు సిపి తెలిపారు. దాదాపు రూ.2 నుండి రూ 20ల వరకు వడ్డీ తీసుకుంటున్నట్లు సమాచారమని పేర్కొన్నారు. ఈ వడ్డీ వ్యాపారస్తులు చాలామంది వడ్డీకి తీసుకున్న వారిపై దోపిడీ చేయడం, కొట్టడం, భయపెట్టడం, రౌడీల ద్వారా బెదిరించడం వంటి ఫిర్యాదులు గతంలో రావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు వెల్లడించారు. వీరందరిపై మనీ లాండరింగ్ యాక్ట్ ప్రకారంగా కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్మూర్:జిల్లా సిపి ఆదేశాల మేరకు అధిక వడ్డీలు వసూలు చేస్తున్న పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్ సోమవారం తెలిపారు.. ఇకముందు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు.,..

మండలంలోని పతేపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వీరి వద్దనుండి 7,410 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జక్రాన్‌పల్లి :జక్రాన్ పల్లి గ్రామంలో అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తున్న మడవేరి రఘు ఆయన తమ్ముడు శంకర్ ఇంట్లో సోమవారం సోదాలు చేసినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ప్రామిసరీ పత్రాలు స్వాధీన పరచుకొని, వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

ఓబీసీ జిల్లా ఇన్‌చార్జిగా నరేందర్‌గౌడ్


నవతెలంగాణ-నిజామాబాద్

లోక్‌సభ ఎన్నికలకు గాను ఓబీసీ జిల్లా ఇన్‌చార్జిగా రాజ నరేందర్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ప్రకటించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నరేందర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో అత్యధిక మెజార్టీ సాధించేలా పని చేస్తానని తెలిపారు.

ప్రాణాలను, ఆస్తులను కాపాడుతాం



బాల్కొండలో..అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పే విధానంపై ఫైర్ సిబ్బంది మాక్‌డ్రిల్



కంఠేశ్వర్ :నగరంలో...

- అగ్నిమాపక శాఖ అధికారులు
- ప్రతి షాపుల్లో ఫైర్ సేఫ్టీ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలి
- అగ్నిమాపక విన్యాసాలు అవగాహన సదస్సులు

నవతెలంగాణ-బాల్కొండ/కంఠేశ్వర్/ఆర్మూర్

ప్రతి ఒక్కరూ షాపుల్లో ఫైర్ సేఫ్టీ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా బాల్కొండ మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అగ్నిమాపక అగ్ని నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వాహనంతో ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తులను, ప్రజల ప్రాణాలను అగ్నికి ఆహుతి కాకుండా సిబ్బంది చేసే ప్రయత్నాలు, సహాసాలు విన్యాసాలను ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక శాఖ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎక్కడైనా ఫైర్ యాక్సిడెంట్ జరిగితే వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బి శేఖర్, ఫైర్ మాన్ హనుమాన్ చారి, హెూంగార్డ్ పి.శ్రీనివాస్, ఎస్. రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రైల్వేస్టేషన్, బస్టాండ్, రిలయన్స్ మాల్, బైపాస్ రోడ్డులో సోమవారం అగ్నిమాపక విన్యాసాలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. డిపో మేనేజర్ ఆనంద్, సిబ్బంది. రైల్వేస్టేషన్లో రైల్వే సిబ్బంది రిలయన్స్ మాల్ సిబ్బంది సహకారంతో అగ్నిమాపక విన్యాసాలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లుప్తంగా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి పి.సర్సింగ్గారావు, సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మూర్ :అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు అగ్ని మాపక శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు.. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్, పెర్కిట్ చౌరస్తా ,తదితర ప్రాంతాలలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు .అగ్ని ప్రమాదాలపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తున్నట్టు,, ప్రాణాలతో పాటు ఆస్తి నష్టం వాటిల్లకుండా సత్వరమే స్పందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో..



కంఠేశ్వర్ : అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు



కంఠేశ్వర్ : బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై డెమో ఇస్తున్న ఫైర్ అధికారులు

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలో ఉపాధి హామీ కూలీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశావర్కర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎండలో పనిచేస్తున్న కూలీలకు శక్తిని పెంచడానికి, అనారోగ్యానికి గురికాకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, డిఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు ఆశా వర్కర్లు తెలిపారు. ఉపాధిహామీ పనులు ముగిసే వరకు పంపిణీ చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన గౌడ సంఘం ప్రతినిధులు


కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణానికి చెందిన గౌడ సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌడ సంఘం ప్రతినిధులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గౌడ సంఘం అధ్యక్షులు సిద్దా గౌడ్, ఎల్లాగౌడ్, మహేష్‌గౌడ్, సిద్దాగౌడ్, సాయిరాంగౌడ్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాయకులు లింగారెడ్డి, భూమయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తయారీ ఓ చోట..
విక్రయం మరోచోట

చందూర్‌లో విచ్చల విడిగా గుల్ఫారం కల్లు విక్రయం

- మందు అధికంగా కలిపి మత్తులోకి దింపుతుండ్రు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ఆబ్కారీ అధికారులు

నవతెలంగాణ-వర్ని

కూలీ నాలీ చేసుకునే పేద ప్రజలను కల్లు డిపో యజమానులు మత్తులోకి దింపుతున్నారు. ఇష్టానుసారంగా కల్లులో మందు కలిపి వారిని మత్తుకు బానిసలుగా చేస్తున్నారు. ఈ విషయంపై కొందరు పెద్దలు కల్లు విక్రయిస్తున్న నిర్వాహకులను 'కల్లులో మందు అధికంగా కలుపుతున్నారు.' అని ప్రశ్నిస్తే దాడులకు సైతం వెనుకాడటం లేదు. అలాగే కల్లు తయారు చేసే ప్రదేశంలోనే విక్రయాలు చేపట్టాలని నిబంధలున్నా.. అక్కడి నుంచి వేరే చోట్ల ఉన్న కల్లుబట్టీలకు కల్లును సరఫరా చేస్తూ విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఆబ్కారీశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కల్లు నిర్వాహకులతో ఆబ్కారీ అధికారులు కుమ్మక్కైనట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చందూర్ మండలంలో మత్తు కలు విచ్చల విడిగా ఇతర గ్రామాలకు పెద్ద వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. మత్తు వచ్చేందుకు కల్లులో రకరకాల పదార్థాలను వినియోగిస్తున్నారు. దీంతో కల్లుతాగేవారు మత్తుకు బానిసవుతున్నారు.

మత్తు ఎక్కువైందని అడిగితే ప్రజలపై దాడులు..

నిత్యం కల్లు తాగేవారు.. కల్లులో మందు ఎక్కువైందని ముస్తేదారులను ప్రశ్నిస్తే కల్లు సేవించే ప్రజలపైన బూతు మాటలతో దాడి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ఆబ్కారీ శాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కల్లులో మందు అతిగా కలిపి విక్రయిస్తున్న కల్లు నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తరలింపు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్లు తయారు చేసిన ప్రాంతం నుంచి ఇతర గ్రామాలకు కల్లును సరఫరా చేయవద్దు. కానీ ఆబ్కారీ శాఖ అధికారులతో ముస్తదారులతో కుమ్మక్కై ఇతర గ్రామాలకు వాహనాల ద్వారా మత్తు కల్లును సరఫరా చేస్తున్నారు. కూలి పని చేసుకునే వ్యక్తులను కల్లుకు బానిస చేస్తున్నారు. కల్లుకు బానిసైన పేద ప్రజలు పైసలు లేకపోతే అఘాయిత్యాలకు సైతం పాల్పడి కటకటల్లోకి వెళ్తున్నారు. దీంతో పేద కుటుంబాలు, వారి పిల్లలు రోడ్డున పడుతున్నారు. అతి భయంకరమైన మత్తు పదార్థాలు కల్లులో కలపడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.


ఓ కల్లుబట్టీలో వాహనం నుంచి దింపుతున్న కల్లీకల్లు

ఘనంగా హనుమాన్ ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం


హోమం చేస్తున్న పండితులు

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు సమీపంలో గల ఒంటి హనుమాన్ ఆలయం శిఖర ప్రతిష్టాపన మహోత్సవం సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు తిప్పయప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి అనంతరం ఆలయ శిఖర ప్రతిష్టాపన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇల్తెపు గంగారం, ఐడిసిఎంఎస్ డైరెక్టర రాజా గౌడ్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, గ్రామ పెద్దలు బుద్ధె రాజేశ్వర్, స్వామి గౌడ్, మైదపు నాగరాజు, సురేష్ పటేల్, ప్రజ్ఞశ్రీ హైస్కూల్ కరస్పాండెంట్ రాజు, సింగడి పాండు, ముట్టెన్ ప్రకాష్, హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షులుగా గాడి నర్సింలు


నియామకపత్రాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

వికలాంగుల సేవా సమితి కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్షునిగా గాడి నరసింహులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చిప్పదుర్గ ప్రసాద్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో విజ్ఞాన్ కేంద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్పదుర్గ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అధ్యక్షునిగా కొనసాగిన బాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన స్థానంలో గాడి నరసింహులను అధ్యక్షునిగా నియమించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సీనియర్ నాయకుడు రంగ్యానాయక్, బంటు స్వామి, కొండల్ రెడ్డి, బంజ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగని అక్రమ మొరం దందా

- అధికారుల హెచ్చరికలేనా.. చర్యలుంటాయా..?


దంప్ చేసిన మొరం కుప్పలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలో అక్రమ మొరం దందా రోజురోజుకు పెరిగిపోతుంది. అక్రమ మొరం దందా నిర్వహిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఓ వైపు రెవెన్యూ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నా.. మరోవైపు ఇలాంటి బెదిరింపులు మాకేమీ పట్టవు అన్నట్టు మొరం దందాను అక్రమార్కులు నిర్వహిస్తున్నారు. అక్రమ మొరం దందా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా మొరం దందా ఆగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మొరం దందాపై నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తారా..?, కేవలం హెచ్చరికలు మాత్రమే జారీ చేసి చేతులు దులుపుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.

ఓపెన్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఈ నెల 25 నుండి మే 2 వరకు నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షిస్తూ ఇటీవల నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్ పరీక్షల మాదిరే అందరు అధికారులు పకడ్బందీగా సమన్వయంతో పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాన్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో పదవ తరగతికి సంబంధించి 923 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 1,444 మంది విద్యార్థులు ఓపెన్ పరీక్షలు రాయనున్నారని అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి (5) పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో రెండు కేంద్రాలు బాన్సువాడ, ఒక కేంద్రం ఎల్లారెడ్డి, మరో రెండు కేంద్రాలు కామారెడ్డిలో ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు (6) పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అందులో బాన్సువాడలో ఒకటి, ఎలారెడ్డిలో రెండు కాగా మిగతా నాలుగు కేంద్రాలను కామారెడ్డిలో ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇంటర్మీడియట్ సైన్స్‌కు సంబంధించి ప్రాక్టికల్స్ మే 3 నుండి 10 వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా, మంచినీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. పోలీస్ బందోబస్తుతో ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేయాలనీ, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలనీ, జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని అన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్.టి.సి. అధికారులు షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపాలని, పరీక్ష నిర్వహణ అనంతరం సమాధానపత్రాలను సీల్ చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకోవాలని, మొబైల్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెస్ అనుమతి లేదని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి రాజు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లింగం, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డిపో మేనేజర్ ఇందిర, తపాలా, పోలీసు, రెవిన్యూ, ఎలెక్ట్రిసిటీ, వైద్య ఆరోగ్య శాఖల నుండి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఘనంగా శివపార్వతుల కళ్యాణం


శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న పండితులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని వజ్జపల్లి గ్రామంలో సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కర కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం తొమ్మిదొవ వార్షికోత్సవం నిర్వహించారు. రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు రవిందర్, కాట్యడ శ్రీకాంత్, గాదె స్వామి, గాడిపల్లి రమేష్‌గౌడ్, ఒడ్డె ఎల్లయ్య, భాస్కర్, సాకలి బాలయ్య, ప్యారం అశోక్, సోమిరి బాలకిషన్, మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు
- పెద్ద ఎక్లారలో విజయోత్సవ సభ
- ఏఎంసీ మాజీ చైర్మన్ మృతికి మౌనం పాటించి నివాళి

నవతెలంగాణ-మద్నూర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దఎక్లారా గ్రామంలో విజయోత్సవ సభ నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా తోటా లక్ష్మీ కాంతా రావు గెలుపొందిన అనంతరం గ్రామంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు గ్రామస్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్కవర్ లక్ష్మణ్ మృతికి సంతాపంగా ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు ఆధ్వర్యంలో మౌనం పాటించారు. అలాగే మద్నూర్ గ్రామ పెద్దలు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే తమ్మెవార్ నాగనాథ్ సతీమణి తమ్మెవార్ సులోచన మరణించడంతో సంతాపంగా సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త చేరికల పట్ల కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. మొదటి విడుతలో రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ వంతు బాధ్యతగా అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇళ్లు వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. రెండు సార్లు ఎంపీగా పనిచేసిన బి.బి పాటిల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని, ఆ పార్టీలో ఉంటే ఓడిపోతానని గ్రహించి బీజేపీలో చేరాడని అన్నారు. అందుకే ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో కాం గ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానించిన పలువురు

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భౌతిక కాయానికి నివాళి..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మద్నూర్ మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్కవార్ లక్ష్మణ్ అకాల మరణం చెందగా.. ఆ విషయాన్ని తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మృతుని ఇంటికి వెళ్లి వారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నక్కవార్ లక్ష్మణ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

చాముండేశ్వరి ఆలయం రాజగోపురం ప్రారంభోత్సవం ఆహ్వాన పత్రిక అందజేత


మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో నిర్మిస్తున్న రాజ గోపురం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొనాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీకి ఆలయం కమిటీ అధ్యక్షులు శేఖర్, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, చముండేశ్వరి ఆలయం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ ఎంపీపీ గాల్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, గోపాల్ రెడ్డి పందిరి మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు రాజిరెడ్డి రాజయ్య, ఎంపిటిసి శంకర్ పూజారి శరత్ చంద్ర తో పాటు పలువురు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలలో కంటి వైద్య శిబిరం


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు కంటి వైద్య అధికారి హరికిషన్ తెలిపారు.. మొత్తం 23 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఇందులో 27 మందికి కంటి లోపాలను గుర్తించి వారికి మందులు పంపిణీ చేశామన్నారు. ఇద్దరు విద్యార్థులకు మోతి బిందును గుర్తించి ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేసినట్టు వివరించారు. అనంతరం విద్యార్థులకు కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసంతి, వైద్య సిబ్బంది క్రాంతి కుమార్, నిఖత్ రమేష్ ఉపాధ్యాయురాలు తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-జుక్కల్/మద్నూర్

మండల కేంద్రంలోని ఎమ్మెలే క్యాంపు కార్యాలయంలో పలు మండలాలకు చెందిన వివిధ పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మద్నూర్ మండలంలోని అంతాపూర్ గ్రామానికి చెందిన ఇతర పార్టీ నాయకులు, యువకులు సాయి పటేల్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పార్టీ కండువా కప్పుకొన్నారు. అదేవిధంగా బిచ్కుంద మండలంలోని వాజీద్‌నగర్ గ్రామనికి చెందిన సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ అధ్వర్యంలో ఎంపిటిసి సాయిలు, మాజీ సర్పంచ్ భూమయ్య, వార్డు సభ్యుడు రమేష్, నాయకులు, యువకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరారు. కార్యక్రమంలో జుక్కల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, క్షేమాజ్ కల్లాలీ మాజీ సర్పంచ్ రమేష్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన పలువురు

మద్నూర్ : జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిపటేల్, హనుమంత్ యా దవ్ ఆధ్వర్యంలో మద్నూర్ మండలం అంతాపూర్ గ్రామ ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతా రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు.